ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 24 ఏప్రిల్ 2025



తహసీల్దార్ కార్యాలయాల్లో

హెల్ప్‌డెస్క్‌లు

- భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ / బొంరాస్‌పేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టం దోహదపడుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. అలాగే రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం కొడంగల్ మండలంలోని పర్సాపూర్ రైతు వేదికలో నూతన చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, ఆర్‌వోఆర్ మార్పులు, చేర్పులు, సాదాబైనామాలు లాంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లో ప్రజల దగ్గరికి అధికారులు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

మండల, డివిజన్ స్థాయిలోనే..

జూన్ 2 నుంచి నూతన చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం దిశగా పని చేస్తామన్నారు. భూ సమస్యలను మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కరించుకునే విధంగా భూ భారతిలో అవకాశం కల్పించారన్నారు. అనంతరం కొడంగల్‌లో నూతన మున్సిపల్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబయ్యగౌడ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, మండల వ్యవసాయ అధికారి తులసి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

బొంరాస్‌పేట్ రైతు వేదికలో జరిగిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా భూముల విషయంలో ఉన్న అభద్రత భావన తొలిగిపోతుందన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా యాసంగి వరికోతలు ఊపందుకున్నాయి. ప్రధానంగా మూసీ నదితోపాటు వాగులు, చెరువుల కింద సాగునీటి సౌకర్యం ఉండటంతో రైతులు అధికంగా వరి సాగుపై మక్కువ చూపించారు. గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో సాగు చేసిన పైర్లు ప్రస్తుతం కోతకు వచ్చాయి. దీంతో వారం రోజులుగా రైతులు పంట కోత పనుల్లో నిమగ్నమయ్యారు. మరో ఐదు రోజుల వరకు వరుణుడు కరుణిస్తే యాసంగి సీజన్‌కు ముప్పు తొలగిపోయినట్లే అని స్థానిక రైతులు చర్చించుకుంటున్నారు.

- హార్వెస్టర్ల చుట్టూ తిరుగుతున్న రైతులు
- భారీగా పెరిగిన డిమాండ్.. గంటకు రూ.2,500
- నిత్యం భయపెడుతున్న ఆకాశంలోని మబ్బులు
- జిల్లాలో 12,575 ఎకరాల్లో వరి సాగు
- ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- కేంద్రాల్లో విక్రయించాలంటున్న అధికారులు



ధాన్యాన్ని కుప్పపోస్తున్న హార్వెస్టర్

ఊపందుకున్న

వరికోతలు

జిల్లా వ్యాప్తంగా ఒకేసారి పంట చేతికి

జిల్లాలో వరిసాగు ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
ఘట్‌కేసర్	3,200
కీసర	1,650
శామీర్‌పేట్	1,925
మూడుచింతలపల్లి	3,000
మేడ్చల్	2,800
మొత్తం	12,575

ఘట్‌కేసర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో పైర్లన్నీ ఒకేసారి కోతకు రావడంతో హార్వెస్టర్లకు భారీగా డిమాండ్ పెరిగింది. స్థానికంగా ఉన్న కోత యంత్రాలతో పాటు పొరుగు రాష్ట్రం తమిళనాడు నుంచి ఇక్కడికి పెద్దఎత్తున యంత్రాలను తీసుకొచ్చిన పరిస్థితి. ఎన్ని హార్వెస్టర్ యంత్రాలు వచ్చినా పంటంతా ఒకేసారి కోతకు రావడంతో రైతులు వాటి యజమానుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇంకా పూర్తిస్థాయిలో యంత్రాలు(హార్వెస్టర్లు) రాలేదని వచ్చినవి సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంట పాటు కోత కోసినందుకు రూ.2,500 చొప్పున వసులు చేస్తున్నారు. జిల్లాలో ఘట్‌కేసర్ మండలంలో 3,200 ఎకరాలు, కీసరలో 1,650 ఎకరాలు, శామీర్‌పేట్ 1,925 ఎకరాల్లో, మూడుచింతలపల్లిలో 3,000 ఎకరాలు, మేడ్చల్‌లో 2,800 ఎకరాల చొప్పున మొత్తం 12,575 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే సగానికి పైగా కోతకు

మిగతా 8వ పేజీలో...

మబ్బులు భయపెడుతున్నాయ్



పైరు కోతకు సిద్ధంగా ఉంది. నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. మొదటి నుంచి చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రస్తుతం పైరు కోతకు సిద్ధంగా ఉంది. నిత్యం సాయంత్రం ఆకాశంలో వచ్చే మబ్బులను చూస్తూంటే భయం వేస్తోంది. వరికోత మిషన్ దొరకగానే పంటను కోయించాలి.


-వడ్లకొండ శివయ్య, కౌలురైతు, ఎన్‌ఎఫ్‌సీ నగర్



తారెత్తిస్తున్న ఎండలు

జిల్లాలో 42.8 డిగ్రీలు నమోదు

వికారాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. ప్రచండ భానుడు ఉగ్రరూపం దాలుస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నాలుగైదు రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం జిల్లాలో 42.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. తొరమామిడి (నాగారం), మర్పల్లి, కొడంగల్‌లో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, దుద్యాల్‌లో 42.6 డిగ్రీలు, మోమిన్‌పేట్‌లో 42.5, బంట్వారంలో 42.4, కోట్‌పల్లిలో 42.2, దోమలో 42.0, వికారాబాద్‌లో 42.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాండూరు ఏఆర్‌ఎస్‌లో 41.8 డిగ్రీలు, పరిగిలో 41.8, ధారూరులో 41.7, బషీరాబాద్‌లో 41.6, తాండూరు, యాలాల్, దావలాపూర్‌లో 41.5, మన్నెగూడ, కాశీంపూర్, దౌల్తాబాద్‌లో 41.4, మద్గుల్ చిట్టంపల్లిలో 41.2, పెద్ద ఉమ్మెంతాల్‌లో 41.1, నవాబ్‌పేట్, రాపోల్, మదన్‌పల్లిలో 41.0 డిగ్రీలు నమోదయ్యాయి. బొంరాస్‌పేట్‌లో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిధుల్లేవు.. పనులు కావు

- కునారిల్లుతున్న పంచాయతీలు
- పూర్తి స్థాయిలో అమలుకాని చట్టం
- నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

7

ఉగ్రదాడిపై నిరసనలు



ఘట్‌కేసర్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా బుధవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. రాజకీయ పార్టీలకు అతీతంగా 'ఉగ్రవాదం నశించాలి' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు తీశారు. అమరులైన వారి చిత్రపటాల వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. సాయంత్రం వేళ పలు పట్టణాల్లోని సెంటర్లలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి క్షతగాత్రులైన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఏప్రిల్ 23



వికారాబాద్: పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

సర్కారు సత్తా!

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ఫలితాలు మెరుగు.. సెకండియర్‌లో అగ్రస్థానంలో మోమిన్‌పేట

ఫస్టియర్‌లో తాండూరు కళాశాల ముందంజ.. ఏటేటా మెరుగవుతున్న ఉత్తీర్ణత శాతం



మోమిన్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

కళాశాలల వారీగా ఇంటర్ ఫలితాలు

ద్వితీయ సంవత్సరం

జూనియర్ కళాశాల	ఉత్తీర్ణత శాతం
మోమిన్‌పేట	61.7
వికారాబాద్	61.5
తాండూరు	59.32
మర్పల్లి	59.0
పరిగి	58.57
కొడంగల్	54.11
దోమ	47.66
పెద్దేముల్	35.19
నవాబ్‌పేట్	25.71
దౌల్తాబాద్	16.67

ప్రథమ సంవత్సరం

జూనియర్ కళాశాల	ఉత్తీర్ణత శాతం
తాండూరు	54.83
కొడంగల్	51.49
బషీరాబాద్	50.0
బొంరాస్‌పేట్	50.0
వికారాబాద్	48.51
దోమ	46.67
పరిగి	45.12
మర్పల్లి	40.98
నవాబ్‌పేట	36.36
పెద్దేముల్	23.53

ఒకేషనల్ విభాగంలో

ఒకేషనల్ విభాగంలో సెకండియర్ ఫలితాల్లో తాండూరు కళాశాల 70.32 శాతం ఉత్తీర్ణత సాధించగా, మర్పల్లి కళాశాల 41.18 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఫస్టియర్‌లో తాండూరుకళాశాల 74.53 శాతం, బషీరాబాద్ జూనియర్ కళాశాల 61.11 శాతం, మర్పల్లి జూనియర్ కళాశాల 20.0 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

వికారాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాయి. గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి మెరుగైన ఉత్తీర్ణతను నమోదు చేసుకున్నాయి. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జనరల్ విభాగంలో 61.7 శాతం ఉత్తీర్ణత సాధించి మోమిన్‌పేట జూనియర్ కళాశాల అగ్రస్థానంలో నిలిచింది. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 54.83 శాతం ఉత్తీర్ణతతో తాండూరు జూనియర్ కళాశాల జిల్లాలో అగ్రస్థానంలో నిలిచింది.

బొంరాస్‌పేట్‌లో జీరో ఉత్తీర్ణత

కాగా, కొత్తగా ఏర్పాటైన బొంరాస్‌పేట్ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఈసారి జీరో ఉత్తీర్ణతను నమోదు చేసుకుంది. ఈ కళాశాల తరపున ఒక విద్యార్థి మాత్రమే పరీక్షలకు హాజరు కాగా,

మిగతా 8వ పేజీలో...

భూ భారతితో సమస్యలు పరిష్కారం

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

పీర్జాదిగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూ సమస్యలు సులభ పద్ధతిలో పరిష్కారం అవుతాయని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సందేహాలను నివృత్తి పరుస్తూ తెలిసి తెలియక జరిగిన తప్పులను సవరించే ఆప్షన్ ఇప్పుడు ఈ నూతన చట్టంలో ఉందన్నారు. రైతులు ఏ సమస్యకూ ఆందోళన చెందే అవసరం లేదన్నారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్ర అభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



విద్యార్థులతో డీఈవో రేణుకాదేవి, ఉపాధ్యాయులు

ప్రభుత్వ విద్య నాణ్యమైనది: డీఈవో

పూడూరు, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు పుస్తకాల్లోని పాఠాలతో పాటు జీవిత పాఠాలు నేర్పిస్తాయని డీఈవో రేణుకాదేవి అన్నారు. 2024-25 విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా మండలంలోని కంకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్య నాణ్యమైనదని, ప్రభుత్వ విద్యా బలోపేతానికి ప్రభుత్వం ఏఐ వంటి నూతన విధానాలు అమలు చేస్తోందన్నారు. పాఠశాలకు తల్లిదండ్రుల సపోర్ట్ ఉంటే ఆ పాఠశాల అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. అనంతరం ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంవో రామ్‌మస్తా, జీహెచ్‌ఎం పుష్ప, హెచ్‌ఎం లక్ష్మణ్, ఛైర్మన్లు సోని, ప్రమీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో ఘనంగా ఎల్లమ్మ జాతర



వికారాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లిలో నాగుల ఎల్లమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. కొత్తగా నిర్మించిన ఊర డమ్మ, ఈర్లమ్మ, నాగఎల్లమ్మ ఆలయాలకు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. కల్లు సాకతో పూజలు చేశారు. అనంతరం నాగఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆర్పీఏ మెంబర్ జాఫర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కుర్మిద్దలో పీఎస్ ఏర్పాటుకు సర్వం సిద్ధం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పోలీస్ స్టేషన్

యాచారం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ధ గ్రామంలో నిర్మించిన నూతన భవనంలోకి వారం, పది రోజుల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ తరలించడానికి పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, పోలీస్‌స్టేషన్ మేడిపల్లిలో కొనసాగడంతో జనం పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో అద్దె భవనంలో ఠాణా, అద్దె భవనంలో ఫార్మాసిటీ పీఎస్ అనే శీర్షికలతో ప్రచురితమైన వరుస కథనాలకు రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. మేడిపల్లిలో పోలీస్‌స్టేషన్ కొనసాగడంతో కందుకూరు మండలంలోని సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, ఉట్లపల్లి, సార్లరావులపల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, మంగలిగడ్డ తండా, పోతుబండ తండావాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న వైనంపై అధికారులు స్పందించారు. పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మించే దాకా అన్ని గ్రామాలకు అనువుగా ఉన్న కుర్మిద్దకు ఠాణాను తరలించాలని రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర పోలీస్ శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందుకుగాను కుర్మిద్దలో అద్దె భవనంలో వసతులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి, ఈ నేపథ్యంలో రెండు మండలాల ప్రజలకు అనువుగా ఉన్న గ్రామానికి పోలీస్ స్టేషన్‌ను తరలించడాన్ని స్వాగతిస్తూ అధికారుల చర్యలను అభినందిస్తున్నారు. వైరింగ్, పాల్‌సీలింగ్ పూర్తిచేసి పోలీస్‌స్టేషన్ తరలింపునకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

అధ్యాపకురాలు సౌజన్యకు డాక్టరేట్



ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ పరిధిలో ఉన్న అనురాగ్‌వర్సిటీ అధ్యాపకురాలు యెర్రమనేని సౌజన్యకు డాక్టరేట్ లభించింది. వర్సిటీ అధ్యయన కోర్సును అభ్యసించి 'మెషీన్ లెర్నింగ్ టెక్నిక్‌తో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు' అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఐటీ డీన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు. ఈనెల 19న ఎన్‌ఐటీ-తిరుచిరాపల్లి ప్రొఫెసర్ ఆధ్వర్యంలో జరిగిన వైవా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ చూపిన సౌజన్యకు బుధవారం డాక్టరేట్‌ను ప్రకటించారు. ఆమెను వర్సిటీ సీఈవో నీలిమ, డీన్లు, అధ్యాపకులు అభినందించారు.

సరిహద్దుల్లో నిఘా పెంచాలి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరురూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో నిఘా మరింత పెంచాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వివిధ కేసులపై ఎస్ఐ విఠల్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొత్లాపూర్, సంగెంకలాన్, మల్కాపూర్, ఓగిపూర్, కరన్‌కోట్ ప్రాంతాల్లో నిఘా పెంచాలన్నారు. ఇసుకరవాణా, అక్రమ మద్యం, మత్తుపదార్థాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుకు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుపై దృష్టిపెట్టాలన్నారు. రాత్రివేళ పోలీసు గస్తీ పెంచాలని ఆదేశించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఏసీడీపీవో రేణుకకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

తాండూరురూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): మే20న కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏసీడీపీవో రేణుకకు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 11 జాతీయ కార్మిక సంఘాలు మే 20న సారస్వతిక సమ్మెను తలపెట్టాయన్నారు. కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, మేనెల మొత్తం సెలవులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తాండూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బాలమణి, కార్యదర్శి బేబీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో కేటీఆర్‌కు స్వాగతం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఘట్‌కేసర్‌లో బుధవారం పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కేటీఆర్ వరంగల్ వెళ్తున్న విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఘట్‌కేసర్‌లోని బైపాస్‌చౌరస్తా చేరుకోగా కేటీఆర్ కొద్దిసేపు ఆగి నాయకులకు అభివాదం చేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, కొండల్‌రెడ్డి, షకీల్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో

పాలసీ విధానం-సవాళ్లు పుస్తకావిష్కరణ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ రచించిన భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో పాలసీ విధానం-సవాళ్లు అనే పుస్తకాన్ని బుధవారం కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక ఆవిష్కరించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అంశాన్ని డా.రమేష్ అందరికీ అర్థమయ్యే రీతిలో పరిశోధనాత్మకంగా రచించారంటూ కొనియాడారు. అంతేగాక అనేక పాఠ్యాంశాలను ఓపెన్ ఇంటర్‌కు, ఎంఏ ఎకనామిక్స్, డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డారని ఆమె గుర్తుచేశారు. పుస్తక రచనపట్ల ఆయనకు మంచి మక్కువ ఉందని.. మున్ముందు మరిన్ని రచనలు చేయాలంటూ సలహా చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సేరేష్, డా.చింతల రాకేష్ భవాని, డీ.ఎస్.ఎస్.ఆర్. కృష్ణ, నరేందర్‌రెడ్డి, డా.మాధవి, రవికుమార్, డా.డి.వి.రావుపాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాధిక తదితరులు



ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

చౌడాపూర్,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవోలు రాంచందర్, హబీబ్ అహ్మద్, హెచ్‌ఎం మల్లికార్జున్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా చేపట్టాలి

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్, తాండూరు మున్సిపల్ ప్రత్యేకాధికారి సుధీర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్లారెస్‌కు 7 రోజులే గడువున్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు రోజూ వార్డుల్లో తిరిగి సమస్యలను పరిష్కరించాలన్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, స్ట్రీట్‌లైట్లకు సంబంధించిన ఫిర్యాదుల రిజిష్టర్‌ను మెయిన్‌టెయిన్ చేయాలని ఆదేశించారు. ట్యాంకులు నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నర్సింహారెడ్డి, డీఈఈ మణిపాల్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఏఈ ఖాజా హుస్సేన్ ఉన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తాం

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పొట్లి మహరాజ్, సీతారాంపేట్ హనుమాన్ ఆలయాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పొట్లి మహరాజ్ ఆలయ ఆవరణలో నిర్వహించారు. భద్రేశ్వరాలయంలో నిత్యాన్నదానానికి దాసోహం భవనాన్ని నిర్మించడం ఈ పాలకవర్గంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఆలయాల చైర్మన్‌లు ప్రసాద్‌గౌడ్, భీమలింగం, దేవాదాయ అధికారులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, కాళికాదేవి ఆలయ చైర్మన్ పి.బస్వరాజ్, డాక్టర్ సంపత్‌కుమార్, వెంకట్‌రాములుగౌడ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారిద్దాం

బషీరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై దృష్టిసారిస్తూ పరిష్కారానికి కార్యాచరణతో ముందుకెళ్దామని ఎంపీడీవో విజయ్‌కుమార్ కార్యదర్శులకు సూచించారు. బుధవారం కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రాజీవ్ యువ వికాసం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఇతర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఎక్కడైనా బోర్లు పనిచేయకుంటే బాగు చేయించాలన్నారు. అడవి పందులతో పొలాలు నాశనం అవుతున్నాయనే అంశంపై రేంజర్ శ్రీదేవిసరస్వతి మాట్లాడారు. పంటల రక్షణకు అడవి పందులను తరిమేసేలా చట్టం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ వై.వెంకటేశ్, ఏవో అనిత, ఎంపీవో జయకర్, ఉపాధి ఈసీ నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం

రాష్ట్ర కమిటీ సభ్యులుగా గిరి, ప్రభు



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

శంషాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌కు చెందిన నర్రా గిరి, అన్నెపు ప్రభులు భవన నిర్మాణ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు. శంషాబాద్‌లో రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభల్లో ప్రతినిధులు వారిని ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు తెలిపారు. గిరి, ప్రభులను బుధవారం పూల మాలలతో సన్మానించారు. ఏఐటీయూసీకి చెందిన వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీ

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో తూనికల కొలతల శాఖ అధికారులు బుధవారం ఒక్కరోజు శిబిరం నిర్వహించారు. మొత్తం 53యంత్రాలను జిల్లా అధికారి రియాజ్ హైమాద్ ఖాన్, సిబ్బంది పరిశీలించి సీలింగ్, చెకింగ్, స్టాపింగ్ చేసి సర్దిపై చేశారు. స్వర్ణకారులు యేటా యంత్రాలను సీలింగ్, చెకింగ్ చేయించుకోవాలని చెప్పారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

25న రెండు ద్విచక్ర వాహనాల వేలం

తాండూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నేరాల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను ఈ నెల 25న ఉదయం 11గంటలకు వేలం వేస్తామని ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ బుధవారం తెలిపారు.

అట్టహాసంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం




కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి అట్టహాసంగా పద్మావతి శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి సరిత దంపతులు స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వరుడు, గరుత్మంతుడి భారీ ప్రతిమలను ఏర్పాటు చేసి, కల్యాణ వేదికను పూలు, పండ్లు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులతో పాటు వేదపండితులు స్వామి కల్యాణోత్సవ విశిష్టతను వివరించారు. కల్యాణోత్సవం చివర ముత్యాల తలంబ్రాలను పోసి, వచ్చిన భక్తులకు పంచారు. కల్యాణోత్సవానికి హాజరైన వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డితో పాటు పార్టీలకతీతంగా హాజరై పట్టణ ప్రముఖులు వేదపండితుల ఆశీర్వాదం పొందారు.

నిధుల్లేవు.. పనులు కావు

- కునారిల్లుతున్న పంచాయతీలు
- గ్రామీణులకు కొరవడిన వసతులు
- పూర్తి స్థాయిలో అమలుకాని చట్టం



నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైంది. అయితే 73 రాజ్యాంగ సవరణ చట్టం, 2018 పంచాయతీరాజ్ చట్టాల ప్రకారం పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. ప్రభుత్వాలు బదలాయించాల్సిన అధికారులను ఇవ్వడం లేదు. నిధుల్లేక, పనులు జరగక పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఏటా ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటుటున్నారు తప్పితే వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవడం లేదు. స్థానిక సంస్థలకు సరిపడా నిధులివ్వడం లేదు. గ్రామ పంచాయతీ, మండల/జిల్లా పరిషత్‌లు నిధులు లేక కునారిల్లుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీలు ఉత్సవ విగ్రహాల్లో మారుతున్నారు. ఐదేళ్లకోసారి సక్రమంగా ఎన్నికలు నిర్వహించక కేంద్ర ఆర్థిక సంఘం నిధులూ రావడం లేదు. దీంతో గ్రామీణులకు సదుపాయాలు, రోడ్లు, వీధి దీపాలు, విద్య, ఉపాధి వంటి సదుపాయలు మృగ్యమవుతున్నాయి.

స్థానిక సంస్థలు నిర్వీర్యం

స్థానిక సంస్థలకు సాధికారిత కల్పించి 20ఏళ్లు గడిచింది. అయినా ప్రభుత్వాలు వాటిని 29 అధికారాలను బదలాయించలేదు. ప్రజా పంపిణీ, సాంఘిక సంక్షేమం, మార్కెట్-ప్రదర్శనలు, లైబ్రరీలు, సాంకేతికశిక్షణ, వృత్తివిద్య, పేదరిక నిర్మూలన, విద్యుదీకరణ, గృహనిర్మాణం, విద్య, పారిశుధ్యం, చిన్నతరహా పరిశ్రమలు, అడవులు, భూ అభివృద్ధి, పశుపోషణ, పాల ఉత్పత్తి, సామాజిక ఆస్తుల పరిరక్షణ తదితర 29అంశాల్లో నేటికీ పంచాయతీలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనుసన్నల్లో సాగుతుండడంతో ప్రజల అభివృద్ధిపై గ్రామ పంచాయతీలు, మండల/జిల్లా పరిషత్‌లు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయి. నిజానికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో పంచాయతీరాజ్ వ్యవస్థే కీలకం. 1993 నుంచి ఏటా ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1994లో రాజ్యాంగ సవరణతో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించారు. అయితే రాష్ట్రంలో చాలా రోజులుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించక ప్రజాప్రతినిధుల్లేరు. గ్రామీణుల బాగోగులు చూసే బాధ్యత అధికారులపై ఉన్నా వారు పూర్తిస్థాయి సేవలందించడం లేదు.

నీటి సమస్య తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. హాజరైన జిల్లా ఎఫ్‌ఎస్‌వో ఎస్‌కే.ఫరీద్ మాట్లాడుతూ.. అడవి పందుల వల్ల పంటనష్టం జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై సూచనలు చేశారు. తహసీల్దార్ మనోహరచక్రవర్తి మాట్లాడుతూ.., భూ సమస్యలుంటే జూన్ 2కల్లా రైతుల పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. సమావేశంలో ఏవో జయశంకర్, ఎంఈవో యాదగిరి, కార్యదర్శులు నర్సిములు, సుగుణ, స్వప్న, రాణి, మాధవి, ప్రవీణ్‌కుమార్, జగన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



యంత్రానికి పూజచేసి ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం : యాదయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే ఆదర్శమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద నూతనంగా కొనుగోలు చేసిన రోడ్లు శుభ్రం చేసే యంత్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూజచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల నూతన మున్సిపాలిటీ మున్సిపాలిటీ పరిధిలోని 12 గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి, పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ పూర్ణచందర్, ఎస్సీసీబీ మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాములు, వసంతం, మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్, గంగి యాదయ్య, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం టు కాశీ.. పాదయాత్ర

» షాద్‌నగర్‌లో స్వాములకు ఘన స్వాగతం



యాత్రికులకు స్వాగతం పలుకుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ రామేశ్వరం పుణ్యక్షేత్రం నుంచి కాశీకి పాదయాత్రగా వెళ్తున్న స్వాములకు ఘనస్వాగతం లభించింది. మార్చి 3న రామేశ్వరంలో ప్రారంభమైన 24 మంది భక్తుల పాదయాత్ర బుధవారం రాత్రి షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంది. ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికి, విడిది ఏర్పాటు చేశారు. 1983 నుంచి ప్రతీ ఏడు సంవత్సరాలకోసారి రామేశ్వరం నుంచి కాశీకి పాదయాత్ర వెళ్తున్నామని, ఇది ఏడవ యాత్ర అని పాదయాత్రకు నాయకత్వం వహిస్తున్న సోమసుందరం తెలిపారు. ప్రతీరోజు 24 కిలోమీటర్ల చొప్పున 2,500 కిలోమీటర్ల పాదయాత్ర జూన్ 28న ముగుస్తుందని తెలిపారు. భారతీయ జాతీయ భావాన్ని ప్రజలకు వివరిస్తూ, దాతల సహకారంతో పాదయాత్రను కొనసాగిస్తున్నామని తెలిపారు. స్వాగతం పలికిన వారిలో పట్టణ ప్రముఖులు బి.జగన్‌మోహన్‌రెడ్డి, పరిగి సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, గందం ఆనంద్, కానుగు రాంభూపాల్, కోట జనార్ధన్, రమేష్ తదితరులున్నారు.ఠి

బీఆర్‌ఎస్‌లో చేరికలు

వికారాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధి 9వ వార్డు బూర్గుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు అనంత్‌రెడ్డి బుధవారం తన వర్గంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే మెతుకుఆనంద్ తన నివాసంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గోపాల్, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ శేఖర్, విజయ్‌కుమార్, గంగారం వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆనంద్



బస్సు కోసం ఎండలో నిరీక్షణ

బషీరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు బస్సుల కోసం రోడ్లపై ఎండలో నిరీక్షిస్తున్నారు. నిత్యం ఇక్కడి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రజలు అవస్థ పడుతున్నారు. ప్రయాణికులకు నిలువ నీడలేదు. ఎండ, వానల్లోనే నిల్చుంటున్నారు. లేదా సమీప ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ప్రతీ గ్రామంలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మంచినీళ్లు మహాప్రభో!

20 రోజులుగా అందని భగీరథ నీరు

లాల్‌గడి మలక్‌పేటలో మహిళల ఆందోళన

ఇరవై రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామంలోని మాలవాడలో 20 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని, పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోతున్నారు. దీంతో బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లాల్‌గడిలోని మాల కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా పైప్ లైన్లను మరమ్మతు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- శామీర్‌పేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి)

నిరసనల వెల్లువ

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి క్షమించరాని నేరమని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. దాడికి పాల్పడిన వారిని బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. వివిధ రూపాల్లో నిరసనలు వెల్లువెత్తాయి.

- షాద్‌నగర్, ఏప్రిల్ 23

ఉగ్రదాడి క్షమించరాని నేరం



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ మైదాన ప్రాంతంలో మంగళవారం పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రదాడి క్షమించరాని నేరం. అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలి. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం క్షమించరాని నేరం. మరణించిన వారికి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా.

-వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే

ఇది పిరికిపంద చర్య



పహల్గాంలో అమాయక ప్రజలపై దాడి పిరికిపంద చర్య. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశ భద్రత, సమగ్రతను దెబ్బతీసేందుకే ఈ దాడుల వెనుక ఉన్న లక్ష్యం. భారత్ కూడా ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలి. ప్రజలందరూ సమైక్యతతో ఉంటూ ఇలాంటి దాడులను .తిప్పికొట్టాలి.

-నవీన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఉగ్రవాదులను అణచివేయాలి



ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. ఉగ్రదాడిలో మరణించిన వారికి ఘన నివాళి అర్పిస్తున్నాం. 28 మంది మరణించడం బాధాకరమైన విషాద సంఘటన. ప్రశాంత వాతావరణంలో ఉన్న దేశంలో అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు చేయడానికి పాల్పడితే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరు. తగిన బుద్ధి చెబుతారు.

-అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే

హిందూ, ముస్లింల మధ్య చిచ్చు



దేశంలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి మారణహోమం సృషించేందుకు చేసిన కుట్రలో భాగంగానే ఉగ్రదాడి జరిగింది. భారత్‌ను అస్థిర పర్చేందుకు పాకిస్థాన్ మిలటరీ కుట్ర చేస్తోంది. దేశంలో అల్లర్లు సృష్టించేందుకే యాత్రికులను ఏ మతం అని అడిగి చంపడం దారుణం.

-పి.విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

మారణహోమం.. అత్యంత దారుణం



కశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయం. కేవలం హిందువులను టార్గెట్ చేసుకొని హతమార్చడం అత్యంత బాధాకరం. ముస్లిం ఉగ్రవాద సంస్థలు మన దేశంలోనే మనకు రక్షణ లేకుండా చేస్తున్నాయి. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి.

-బందారు రమేష్, వీహెచ్‌పీ క్షేత్ర ప్రముఖ్

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి చంపడం దారుణం. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించి వేయాలి. హిందువులనే టార్గెట్ చేసి చంపడం అత్యంత బాధాకరం. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉక్కుపాదంతో అణచివేయాలి. ప్రజలు ఐక్యంగా ఉంటూ ఉగ్రవాదంపై పోరాడాలి.

-పల్లె నర్సింగ్ రావు, మాజీ జెడ్పీటీసీ, కేశంపేట


వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు


ఘట్‌కేసర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఉగ్రవాదులను ఉక్కుపాదంతో అణచివేయాలి

జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో మంగళవారం ఉగ్రమూకలు 28 మంది అమాయకులను కాల్చి చంపడం హేయమైన చర్య అని ప్రజలు, నాయకులు, మానవతావాదులు అన్నారు. ఉగ్రవాదుల చర్యను నిరసిస్తూ బుధవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మతాలకు అతీతంగా నిరసన ర్యాలీలు చేపట్టారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రాత్రిపూట కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని మట్టుబెట్టే చర్యలను మరింత తీవ్రతరం చేయాలని కోరారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి)



కోట్‌పల్లి: ఉగ్రవాదుల దాడికి నిరసనగా మండల కేంద్రంలో ర్యాలీలో స్థానికులు


వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ముస్లిం నాయకులు


తాండూరు రూరల్: మల్కాపూర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం


పెద్దేముల్‌లో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గ్రామస్తులు


పరిగి కోర్టు ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ప్రభుత్వ బడుల్లో బంగారు భవిష్యత్తు


దుద్యాల: విద్యార్థులతో ఎంఈవో విజయరామారావు, ఉపాధ్యాయులు

పరిగి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో గోపాల్ అన్నారు. బుధవారం ఈ విద్యా సంవత్సర చివరిరోజు సందర్భంగా మిట్టకోడూరులో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రోగ్రెస్ కార్డులందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందుతుందని, ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. ఉచిత పుస్తకాలరు, మధ్యాహ్న భోజనం, స్కూల్ డ్రెస్సులు అందజేస్తామన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ఉత్తమ విద్య పొందొచ్చని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గురుకులానికి ఎంపికైన తపస్విని, వైష్ణవిలను సన్మానించారు. హెచ్ఎం ఉస్మాన్ అలీ, నాయకులు పి.మాణిక్యం, జహీరబీ, నర్సింహులు, అనురాధ, అనిత, టీచర్లు కృష్ణయ్య, నర్సింహులు, రాజు, కవిత, అంగన్‌వాడీలు పద్మమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలని ఉపాధ్యాయుడు రమేశ్ అన్నారు. ఎన్కతల పాఠశాలలో తల్లిదండ్రులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.

కొడంగల్ రూరల్: చిట్లపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఏడో తరగతి విద్యార్థులకు న్యాయవాది మధుసూదన్‌రెడ్డి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో హరీశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, హెచ్ఎం యాదగిరి, నాగమ్మ, గోవర్ధన్, బనలక్ష్మి, నాగప్ప, జ్యోతి, అనిత పాల్గొన్నారు.

తాండూరు రూరల్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జినుగుర్తి స్కూల్ హెచ్ఎం నాగప్ప అన్నారు. పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. గ్రామస్తులు, టీచర్లు పాల్గొన్నారు. చిట్టిఘనాపూర్ పాఠశాలకు అదానిఫౌండేషన్ 25డ్యుయెల్ డెస్క్ బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సిరెడ్డి, గ్రామస్తుడు విజయ్‌కుమార్, టీచర్లు శశివర్ధ, ప్రమోద్‌కుమార్, అదాని కంపెనీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సంతోష్, నాగార్జున పాల్గొన్నారు.

దుద్యాల: అన్ని పాఠశాలలకు బుధవారం వేసవి సెలవులు ప్రకటించారు. ఎంఈవో విజయరామారావు మాట్లాడుతూ.. సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, ఎండల్లో తిరగొద్దని, బావులు, చెరువుల వద్దకు వెళ్లొద్దని సూచించారు. పుస్తక పఠనం చేయాలన్నారు. టీచర్లు రవీందర్‌గౌడ్, మల్లప్ప, రమేశ్, శ్రీనివాస్, రవి, సుధాకర్‌రావు, ముకుందరెడ్డి, రాములు, సాలిబాయి, మాధవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. బుధవారం ఈ విద్యా సంవత్సరం చివరి వర్కింగ్ డే కొనసాగింది. గురువారం నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు ఉండనున్నాయి. పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల నుంచి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. విద్యార్థులు ఇళ్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులు చెప్పి పంపారు. కులకచర్ల కేజీబీవీలోని విద్యార్థినులను వారి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.


కులకచర్ల: కేజీబీవీ నుంచి విద్యార్థినులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు, బంధువులు


మోమిన్‌పేట్: ఎన్కతలలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో టీచర్ల సమావేశం

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

యాలాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ గిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోకట్ రోడ్డులో రైల్వే ట్రాక్ సమీపంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు రైల్వేట్రాక్ వద్ద పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఆధారాలేవీ లభ్యం కాలేదు. తెల్ల బనియన్, గళ్ల లుంగీ ధరించాడని, ఐదడుగుల ఎత్తునున్నాడని, 55ఏళ్ల వయస్సు ఉండొచ్చని ఎస్ఐ తెలిపారు. వడదెబ్బ సోకి చనిపోయి ఉండొచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే తాండూరు డీఎస్పీ నం:8712670017, రూరల్ సీఐ 8712670051, యాలాల ఎస్ఐ 8712670054లను సంప్రదించాలని కోరారు.

రెండిళ్లలో చోరీ

● పెళ్లింట్లో బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

పరిగి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి):పరిగిలోని పెళ్లి కార్యం ఉన్న ఓ ఇంట్లో చోరీ దొంగతనం జరిగింది. విద్యానగర్‌లో ఉంటున్న తుక్యానాయక్ కొడుకు పెళ్లి ఉండడంతో ఇంటికి తాళం వేసి సొంతూరు మైసమ్మతండాకు వెళ్లారు. మంగళవారం రాత్రి దొంగలు చొరబడి బీరువాలో పెళ్లి ఖర్చుల కోసం ఉంచిన రూ.2.15లక్షల నగదు, తులంన్నర బంగారు, 20తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అలాగే ముజీబ్ ఇంట్లో తులం బంగారం, 8తులాల వెండి ఆభరణాలు దొంగిలించారు. బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి పరిశీలించారు.

అక్రమంగా సుద్ద తవ్విన వారిపై కేసు

పెద్దేముల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇతరుల భూమిలో అక్రమంగా సుద్ద తవ్వాడనే ఫిర్యాదుతో ఓ విలేకరి, ఇతరులపై పోలీసులు కేసునమోదు చేశారు. బుధవారం హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తింసాన్‌పల్లిలో తమ భూమిలో ఓ విలేకరి,మరికొందరు సుద్ద తవ్వుకున్నారని భూమి యజమాని బిచ్చిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్


బొంరాస్‌పేట్: కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమళ్లలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి టాకింగ్ చేసిన విధంగా రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లాలో 128వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు అన్నీ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం వస్తుందని తెలిపారు. అదే విధంగా గౌరారం గ్రామంలోని శ్రీసాయిరైస్ ఇండస్ట్రీస్‌ను తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంబడి డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎం మోహన్‌కృష్ణ, డీటీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల: ప్రభుత్వ మద్దతు ధర వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. దుద్యాల మండలం లగచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నర్సిములుయాదవ్, అంజి, బాబు, హన్మంతు, కిష్టప్ప పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ధాన్యం మద్దతు ధర కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్తా, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. కొడంగల్ మండలం పర్సాపూర్, హస్నాబాద్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం విక్రయాల్లో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు బోనస్ ఇస్తోందని తెలిపారు. వడ్లను కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, అంజాద్, వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, పకీరప్ప, మల్లేశం, భీములు పాల్గొన్నారు.


దుద్యాల:కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్


కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ర్యాంకర్లకు యాజమాన్యం అభినందన


విద్యార్థినులను సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, తదితరులు

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాండూరు సింధూ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు 3, 5వ ర్యాంకులను సాధించారు. బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో ఆఫ్రిన్ ఫాతిమా 993 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో ర్యాంక్ పొందింది. అలాగే సఫియా మేహ్రిన్ సీఈసీలో 984మార్కులతో రాష్ట్రంలో ఐదో నిలిచారు. వీరిని బుధవారం కళాశాల డైరెక్టర్ రంగారావు, ప్రిన్సిపల్ విజయదేవి, అధ్యాపకులు సన్మానించారు.

ధారూరు:ఇంటర్మీడియెట్ ఫలితాల్లో టాపర్‌లుగా నిలిచిన ఇద్దరు విద్యార్థినులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్, కాంగ్రెస్ పార్టీనాయకులతో కలిసి సన్మానించారు. ధారూరు విద్యార్థిని నవ్యప్రణతి 992, శ్రావ్య 962 మార్కులు సాధించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజానాయక్, కాంగ్రెస్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్:ఇంటర్‌లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలపేరు నిలబెట్టారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. ఐనెల్లిలోని మోడల్ స్కూల్/జూనియర్ కాలేజీలో విద్యార్థులను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులోనూ విద్యార్థులు ఇలాగే బాగా చదవాలని సూచించారు. అనంతరం ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు.

వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



చౌడాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలం మల్కాపూర్ తండాలో బుధవారం జరిగిన పెళ్లికి పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

'సర్కారు' సత్తా!

(5వ పేజీ తరువాయి)

ఆ విద్యార్థి ఫెయిల్ అయ్యారు. అదే ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు హాజరు కాగా, వారిలో ముగ్గురు ఉత్తీర్ణులు కాగా, మిగతా ముగ్గురు ఫెయిల్ అయ్యారు. ఇదిలా ఉంటే, దౌల్తాబాద్ జూనియర్ కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో ఒకరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

అధికారుల నిత్య పర్యవేక్షణతోనే..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం ఏటేటా పెరుగుతోంది. గత మూడేళ్లుగా ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత మెరుగు పడుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ప్రీఫైనల్ పరీక్షలు కొనసాగేంత వరకు జూనియర్ కళాశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల చదువుల తీరుపై జిల్లా ఇంటర్ విద్యా శాఖాధికారి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇంటర్‌లో ఉత్తీర్ణత పెరిగేందుకు కళాశాలల వారీగా నిర్వహించే సమావేశాల్లో లెక్చరర్లు, విద్యార్థులు అనుసరించాల్సిన మార్గాలు, సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించడం ఉత్తీర్ణత పెరగడానికి దోహదపడిందనే చెప్పాలి.

ప్రత్యేక తరగతులతో మేలు ..

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించడం, వెనకబడిన విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టి సారించడం, క్రమం తప్పక పరీక్షలు నిర్వహించడం జిల్లాలో ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధించడానికి ఎంతో ఉపయోగపడిందని జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి శంకర్‌నాయక్ ఆంధ్రజ్యోతి ప్రతినిధితో చెప్పారు. వచ్చేసారి ఇంటర్ ఫలితాలు మరింత మెరుగయ్యే విధంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.

మేడ్చల్‌లో గురుకులాల హవా

మేడ్చల్ ప్రతినిధి(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఈ ఏడాది ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్‌ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు అలాగే కిష్టాపూర్ గురుకులంలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 5 శాతం మెరుగైన ఫలితాలు సాధించింది. ఈ ఏడాది వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. గురుకుల సంక్షేమ వసతి గృహానికి చెందిన శృతి అనే విద్యార్థి ఎంఈసీ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు, మొదటి సంవత్సరం సీఈసీలో శోభారాణి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. అదే విధంగా మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కూడా గతేడాది కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. కీసరగుట్ట రెసిడెన్షియల్ కళాశాలలో గతేడాది కంటే ఒక్క శాతం పెరుగుదలతో మెరుగైన ఫలితాలు సాధించారు. గతేడాది 91 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలో మేడ్చల్ జిల్లా రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచింది.

నేడు గ్రామాల్లో భూ భారతి అవగాహన కార్యక్రమాలు


తాండూరు రూరల్: మాట్లాడుతున్న తారాసింగ్

తాండూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్గిస్తామని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భూభారతిపై నేడు అంతారం రైతు వేదిక వద్ద ఉదయం 11.30గంటలకు కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరు కానున్నారని తహసీల్దార్ చెప్పారు. గ్రామాల నుంచి రైతులు వచ్చి భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

బషీరాబాద్: భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై గురువారం మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేశ్ బుధవారం తెలిపారు. బషీరాబాద్ రైతువేదికలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని చెప్పారు. భూ భారతి చట్టం విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రజేంటేషన్‌తో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

ఘట్‌కేసర్ రూరల్: భూ భారతి అవగాహన సదస్సులు విజయవంతం చేయాలని రైతులను తహసీల్దార్ డీఎస్.రజిని కోరారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్రవారం(రేపు) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ డీఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం 10గంటలకు భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా వస్తారన్నారు. ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టంలోని అన్ని అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.


ఘట్‌కేసర్ రూరల్:మాట్లాడుతున్న తహసీల్దార్ రజని

దోమ: భూ భారతి చట్టంపై ఈ నెల 25న మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. భూ భారతిలో భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన సదస్సుకు రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


దోమ: మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

ఊపందుకున్న వరికోతలు

(5వ పేజీ తరువాయి)

పైర్లు సిద్ధంగా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలంలో మూసీనదితో సాగునీటి సౌకర్యం పుష్కలంగా ఉండటంతో అత్యధికంగా ఇక్కడే వరి సాగు చేశారు.

కోతల్లో జాగ్రత్తలు పాటించాలి

వరికోతల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కోతకు సిద్ధమయ్యే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. పైరులోని కంకులను పరిశీలించి కంకికున్న అన్ని గింజలు గట్టిపడిన తర్వాతనే నీటి తడిని ఆపాలి. కంకి మొత్తం ఎండి గింజలు బంగారం వర్ణంలోకి మారిన తర్వాతనే కోతలు చేపట్టాలి. పంటను కోసిన అనంతరం ధాన్యాని ఎండబెట్టాలి. అలాకాకుండా వెంటనే కుప్పబోసి కప్పివేయడం వలన ధాన్యంలో ఉండే తేమతో ముక్కిపోయి ధాన్యం రంగుమారే ప్రమాదం ఉంది. కోసిన వెంటనే ఒకటిరెండు రోజులు ఎండబెట్టి ఉంచుకుంటే ధాన్యం పాడవకుండా నిల్వ ఉండే అవకాశం ఉంటుంది. వరికోతలో పాటించాల్సిన నిబంధనలపై ఇప్పటికే వరికోత యంత్రాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఒకటి రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

25శాతం కోతలు పూర్తయ్యాయి



నాలుగేకరాల్లో సాగు చేసిన పంటను కోయించాను. ధాన్యం పాడవకుండా ఎండబెట్టి కప్పిబెట్టాను. మా గ్రామంలో ఇప్పటివరకు 25శాతం కోతలు పూర్తయ్యాయి. వారం రోజుల్లో ధాన్యాన్ని తూకం వేయడానికి సిద్ధం చేస్తున్నాం.

- బొక్క శ్రీనివాస్‌రెడ్డి, రైతు బొక్కోనిగూడ, ఘట్‌కేసర్

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. రైతులు వ్యాపారులకు అమ్మి మోసపోవద్దు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

- సుగుణాబాయి, పౌర సరఫరాల శాఖ అధికారి

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొడంగల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ఆడపడచుల పెళ్లిళ్ల కోసం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేస్తామని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అంగడిరైచూర్, చిన్ననందిగామ, చిట్లపల్లి, ఇందనూర్, కొడంగల్, పర్సాపూర్, ప్యాలమద్ది, రావులపల్లి, రుద్రారం గ్రామాలకు చెందిన 24మందికి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని ఆయన వివరించారు.

దశదిన కర్మకు హాజరైన విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెంకలాన్‌లో మాజీ సర్పంచ్ నారాయణగౌడ్ సతీమణి వకుళావతి దశదినకర్మ బుధవారం తాండూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. ఆయతో వెంట మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు అనితాగౌడ్, మేఘనాథ్‌గౌడ్, పరిమళ తదితరలు ఉన్నారు.


వకుళావతి ఫొటోకు నివాళులు అర్పిస్తున్న మహేందర్‌రెడ్డి, నాయకులు